
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రేపు జిల్లా స్థాయి యువజనోత్సవాలు

మేడ్చల్ సెప్టెంబర్ 2(ఆంధ్రజ్యోతిప్రతినిధి): యువతలో ప్రతిభనుగుర్తించేందుకు ప్రభుత్వం యువజన క్రీడోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖాధికారి జి.వి.గోపాల్‌రావు తెలిపారు. ఈనెల 27న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహించే ఉత్సవాల్లో యువతీ, యువకులు పాల్గొనవచ్చన్నారు. 15-29 ఏళ్లలోపు అభ్యర్థులు గురువారం కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా మెయిల్, 766099518 నంబరు వాట్సాప్ ద్వారా వివరాలను తెలపాలన్నారు.

అన్నీ రంగాల్లో వెనకబాటుకు గురైన కొడంగల్ నియోజక వర్గాన్ని తెలంగాణలో మోడల్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఫోకస్ పెట్టారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న కొడంగల్ నియోజక వర్గం విద్య, ఉద్యోగ, వ్యాపార, పారిశ్రామిక, ఉపాధి రంగాల్లో వెనకబాటుకు గురైంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్య మంత్రిగా బాధ్యతలు చేపట్ట డంతో అభివృద్ధిపై ఈ ప్రాంత ప్రజలకు ఆశలు చిగురిస్తున్నాయి.

- కడా ఏర్పాటుతో మారుతున్న రూపురేఖలు
- ఎత్తిపోతలతో లక్ష ఎకరాలకు సాగునీరు
- వికారాబాద్-కృష్ణ రైల్వేలైన్ ఏర్పాటుపై దృష్టి
- ఎడ్యుకేషన్ హబ్‌గా మారనున్న కొడంగల్
- రూ.4358.65 కోట్ల పనులకు శ్రీకారం





కొడంగల్ పట్టణం

ప్రగతికి పక్కా ప్లాన్!

కొడంగల్ అభివృద్ధిపై సీఎం రేవంత్ ఫోకస్

కొడంగల్, సెప్టెంబరు 25: కొడంగల్ అభివృద్ధిపై సీఎం ఫోకస్ పెట్టారు. ప్రగతికి ఎప్పటికప్పుడు రాష్ట్ర, జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేయించారు. గత మాజీ సీఎంలు ప్రాతినిధ్యం వహించిన గజ్వేల్, కుప్పం, పులివెందుల నియోజకవర్గాలకు ధీటుగా కొడంగల్ ప్రాంత అభివృద్ధికి రూపకల్పన చేస్తున్నారు. సీఎం రాష్ట్ర రాజకీయాలు, పాలన వ్యవహారాల్లో బిజీగా ఉండటంతో కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ ఆథారిటీ (కడా) ఏర్పాటుతో ప్రత్యేకాధికారిగా వెంకట్‌రెడ్డి నియమించగా కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డికి అభివృద్ధి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికీ నియోజకవర్గంలో విద్య, వ్యాపార, ఉపాధి హబ్‌గా ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నారు. మెడికల్, వైద్య, ఇంజనీరింగ్, ఐటీఐ కళాశాలలు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పరిశ్రమలు, నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. అందుకు అవసరపడే నిధులు రూ.4358.65 కోట్లు విడుదల చేశారు. వాటితో ఇప్పటికే పలు పనులు ప్రారంభం కాగా మరిన్ని టెండర్‌దశలో ఉన్నాయి. నియోజకవర్గ పరిధిలోని డబుల్‌లైన్ రోడ్లు, గుడి, బడి, మసీద్, అంతర్గత రోడ్లు తదితర వాటికి పెద్దపీట వేస్తూ ముందుకెళ్తున్నారు. కొడంగల్, కోస్గి మున్సిపాలిటీల అభివృద్ధికి అదనంగా రూ.400 కోట్లకు ప్రతిపాదనలతో మంజూరుకు సిద్ధంగా ఉన్నాయి.



కొడంగల్ కడా కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న అధికారులు (ఫైల్)

● విద్యాలయాలకు కేంద్ర బిందువుగా

విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో వెనకబడిన కొడంగల్ ప్రాంతం అభివృద్ధి జరిగేలా మొదటగా విద్యతోనే సాధ్యపడుతుందని ప్రణాళికలు సిద్దంచేశారు. అందులో కొడంగల్ మండల పరిధిలోని అప్పాయిపల్లి శివారులో మెడికల్, పశువైద్య కళాశాలలు, స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు, కోస్గిలో ఇంజనీరింగ్ కళాశాల, దుద్యాల మండల పరిధిలోని హకీంపేట్‌లో ఐటీఐ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండల కేంద్రాల్లో జూనియర్ కళాశాలలు, పాత కొడంగల్ పరిధిలో మినీ స్టేడియం, సమీకృత గురుకులాలల ఏర్పాటుకు కసరత్తులు చేపట్టారు. ఎడ్యూకేషన్ హబ్‌గా మార్చేందుకు ప్రతిపాదనలతో సీఎం నియోజకవర్గంలో అన్నీ విధాలుగా అభివృద్ధి పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

మరో రూ.500 కోట్ల పనులకు శంకుస్థాపనలు

మొదటి విడతలో కొడంగల్ నియోజకవర్గానికి మంజూరు చేసిన రూ.4358.65 కోట్ల నిధులతో ఫిబ్రవరిలో సీఎం కోస్గిలో జరిగిన కార్యక్రమంలో పనులకు శంకుస్థాపనలు చేశారు. రెండోవిడతలో అక్టోబరులో మరో రూ.500 కోట్లకు పైగా నిధులతో శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అందులోరూ.120 కోట్లతో పాతకొడంగల్ సమీపంలో 20 ఎకరాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సమీకృత గురుకులం, వసతిగృహాల పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. మార్కెట్‌యార్డులో దాదాపు రూ.11కోట్ల వ్యయంతో భవన నిర్మాణం, సామగ్రి ఇతరాత్ర వాటిని ప్రారంభించనున్నారు. దీంతో పాటు డబుల్ లైన్‌రోడ్లు, గ్రామీణ ప్రాంతాలకు బీటీ రోడ్ల పనులను ప్రారంభించనున్నారు.



కోస్గిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు (ఫైల్)

● కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతలకు శ్రీకారం

వ్యవసాయ ఆధారిత పంటలపై జీవనం కొనసాగించే ఈ ప్రాంత ప్రజలు, రైతులకు కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకంతో 1.30లక్షల ఎకరాలకు సాగు, తాగునీరందించే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకు లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ.2945.5 కోట్లు మంజూర్‌తో ఇప్పటికే సర్వేలు పూర్తి చేసి పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టనున్నారు. పది రిజర్వాయర్లను నిర్మించనున్నారు.

ఆదర్శంగా కొడంగల్

కొడంగల్ ప్రాంతాన్ని రాష్ట్రంలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. విద్య, ఉద్యోగ, ఉపాధి కల్పనతో పాటు డబుల్‌లైన్ రోడ్లు, అంతర్గత రోడ్లు తదితర వాటి అభివృద్ధి కోసం చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గానికి గుండెకాయలాంటి కోస్గి, కొడంగల్ మున్సిపాలిటీల అభివృద్ధి కోసం రూ.400 కోట్ల ప్రతిపాదనలతో త్వరలోనే పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక కృష్ణ-వికారాబాద్ రైల్వేలైన్ సర్వేతో పనుల ప్రారంభానికి కసరత్తు చేస్తున్నారు.

మంజూరైన రూ.4358.65 కోట్లు

కొడంగల్ ప్రాంత అభివృద్ధికి ఇప్పటి వరకూ రూ.4358.65 కోట్లు మంజూరయ్యాయి. అందులో భాగంగా నారాయణపేట, కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ కోసం రూ.2945.5 కోట్లు, పశువైద్య శాల ఏర్పాటుకు రూ.360 కోట్లు, ప్రధానరోడ్లు, కల్వర్టుల ఏర్పాటుకు రూ.344.5 కోట్లు, ఆర్అండ్‌బీ అతిథి గృహలకు రూ.6.8కోట్లు, ప్రభుత్వాసుపత్రిని 50నుంచి 220 పడకలుగా మార్చేందుకు, మెడికల్, నర్సింగ్, ఫిజియోథెరపీ కళాశాలలకు రూ.224.5 కోట్లు, నియోజకవర్గంలో ఇతరాత్ర 30 పనులకు రూ.213.2 కోట్లు, గురుకుల పాఠశాలలకు రూ.90 కోట్లు, గిరిజన గురుకుల పాఠశాలకు రూ.17.56 కోట్లు, కోస్గిలో అప్‌గ్రేడేషన్ పాల్‌టెక్నిక్ నుంచి ఇంజనీరింగ్ కళాశాలకు మార్చేందుకు రూ.30 కోట్లు, కోస్గిలో మహిళా డిగ్రీ కళాశాలకు రూ.11 కోట్లు, బొంరాస్‌పేట్, దౌల్తాబాద్‌లో జూనియర్‌కళాశాలలకు రూ.7.13 కోట్లు, కొడంగల్ మున్సిపల్ అభివృద్ధికి రూ.45 కోట్లు, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి రూ.18.50 కోట్లు, బురాన్‌పూర్‌లో మహాత్మాజ్యోతి బాపూలే బాలికల, కొడంగల్‌లో అదనపు తరగతి గదుల కోసంరూ.48.45 కోట్లు, కడా పరిధిలో ఇతరాత్ర పనులకు రూ.16.25 కోట్ల మంజూరుతో పనులు ప్రారంభమయ్యాయి.

రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారుల పర్యటనలు

కొడంగల్ అభివృద్ధికి కడా ఏర్పాటుతో ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో పనులు వేగవంతంగా సాగుతున్నాయి. అందులో భాగంగా రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు తరచూ పర్యటిస్తున్నారు. అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో సమావేశాలు, సలహాలు, సూచనలు చేస్తున్నారు. ఇటీవల మెడికల్ కళాశాల భూ బాధితులకు పరిహారం అందించి పనులకు శ్రీకారం చుట్టారు.

ఆదర్శంగా కొడంగల్ అభివృద్ధి



కొడంగల్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎంప్రత్యేక దృష్టి సారించారు. ఇందుకు విద్య, ఉద్యోగ, వైద్యం, పారిశ్రామిక, సాగు, తాగునీరు, గ్రామాలు, తండాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ప్రారంభమయ్యాయి. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం, రైల్వేలైన్, మెడికల్, ఇంజనీరింగ్ కళాశాలలు, సమీకృత గురుకులాలు తదితర పనులు కొనసాగనున్నాయి.

తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్

కడా ఏర్పాటుతో అభివృద్ధికి పెద్దపీట



కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా కడా ఏర్పాటుతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. మొదటి విడత పనులు కొనసాగుతుండగా మెడికల్, వైద్య కళాశాలలు, ఇంజనీరింగ్, ఐటీఐ, జూనియర్ కళాశాలలు, లిఫ్ట్ ఇరిగేషన్ తదితర పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అభివృద్ధి పనులపై సమీక్షలు నిర్వహిస్తున్నారు.

వెంకట్‌రెడ్డి, కడా ప్రత్యేకాధికారి



దోర్నాల్‌పల్లి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఆరోగ్యానికి చిరుధాన్యాలు దోహదం

కలెక్టర్ ప్రతీక్ జైన్

దోమ/పరిగి, సెప్టెంబరు 25: సంపూర్ణ ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఎంతో దోహదపడతాయని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. బుధవారం దోమ మండలంలోని దోర్నాల్‌పల్లి, బాసుపల్లి , పరిగి మండలం నజీరాబాద్‌తండాలోగ్రామాల్లో వాసన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పంటల సాగుపై స్వచ్ఛంద సంస్థలు చేయూతను అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఏటేటా పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగంపై పెరగడం వల్ల, వాటిఉత్పత్తి ద్వారా వచ్చే ఆహారాన్ని తినడం వల్ల అనేక రోగాల బారినపడాల్సి వస్తుందన్నారు. రైతులు పంటల సాగులో సేంద్రియ పద్ధతులను అలంబించాలని సూచించారు. సహజసిద్ధంగా లభించేవాటితో పంటలు సాగు చేయడం వల్ల ఖర్చులను కూడా తగ్గించుకోవచ్చని, ఆ దిశగా రైతులు ప్రయత్నం చేయాలని సూచించారు. అనంతరం దోర్నాలపల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన చిరుధాన్యాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. బాసుపల్లిలో పాఠశాలలో మధ్యాహ్న భోజనం, తాగునీటి సదుపాయాన్ని పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఏవో ప్రభాకర్‌రావు, ఎంపీడీవో లు మహేశ్‌బాబు, ఎంఏ కరీం, తహసీల్దార్ ఆనంద్‌రావు మాజీ సర్పంచ్ యాదయ్య సాగర్ పాల్గొన్నారు.





బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పూల సింగిడికి వేళాయె!

జిల్లాలో పూల పండుగ సందడి మొదలైంది. మహిళలు బతుకమ్మ సంబరాలకు సమాయత్తం అవుతున్నారు. బుధవారం కొడంగల్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణిరాజేందర్ నివాసంలో తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. ఇంటి ఆవరణలో ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలతో ర్యాలీగా వెళ్లి కొడంగల్ పట్టణ శివారులోని బండెల ఎల్లమ్మకుంటలో నిమజ్జనం చేశారు. ప్రతి ఏడాది నవరాత్రుల సందర్భంగా ముందుగానే బతకమ్మ ఆడిపాడడం ఆనవాయితీ అని వారు చెప్పారు.

- కొడంగల్, సెప్టెంబరు 25

ఘనంగా వయోవృద్ధుల దినోత్సవం



వృద్ధులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న కృష్ణారెడ్డి

మేడ్చల్ సెప్టెంబరు 25(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. వయోవృద్ధుల వారోత్సవాల్లో భాగంగా సీనియర్ సిటిజన్స్‌చే ప్రతిజ్ఞ చేయించడం, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకథాన్‌ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టంపై అవగాహన, 29న ఎల్డర్‌లైన్ టోల్‌ఫ్రీ నంబర్‌పై అవగాహన, 30న అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాండ్ పేరెంట్స్ డే, అక్టోబర్ 1న ముగింపు కార్యక్రమం ఉంటుందని కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా సంక్షేమాధికారితో పాటు జిల్లా విద్యాధికారి, డీఎంహెచ్‌వో, డీఆర్‌డీఏ, జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లాలోని సీడీపీఓలు, జిల్లా వయోవృద్ధుల కమిటీ అధ్యక్షుడు నాగేశ్వర్ రావు, సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.

అసైన్డ్‌లో అక్రమ నిర్మాణాలు

- ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు
- అయినా ప్లాట్లు చేసి విక్రయాలు
- బోర్డును తొలగించి నిర్మాణాలు చేపట్టిన అక్రమార్కులు
- నిబంధనలను అతిక్రమిస్తున్న భూ బకాసురులు

కీసర, సెప్టెంబరు 25: రెవెన్యూ అధికారుల ఆదేశాలను భూ బకాసురులు బేఖాతారు చేస్తున్నారు. సీలింగ్‌భూమి అని అధికారులు సూచిక బోర్డు ఏర్పాట్లు చేసినా, అక్రమార్కులు బోర్డును తొలగించి యథేచ్ఛగా ప్లాట్లు చేసి, నిర్మాణాలు చేపట్టారు. అంకిరెడ్డిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 780/బీలో దాదాపు రెండు ఎకరాల అసైన్డ్ భూమిలో రియల్టర్లు గతంలో 80గజాల చొప్పున ప్లాట్లుగా విభజించి, విక్రయాలు జరిపి కోట్లు దండుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు రియల్టర్లకు నోటీసులు జారీ చేశారు. అయినా భూ బకాసూరులు అధికారులు, గ్రామస్తులకు తెలియయకుండా ప్లాట్ల హద్దురాళ్లకు బదులు చిన్న, చిన్న మొక్కలను హద్దులుగా నాటి అమాయక ప్రజలకు ఆమ్మేందుకు ప్రయత్నించారు. దీంతో గ్రామస్థులు అధికారులకు మరోసారి ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు సీలింగ్ భూమిని సర్కారు భూమిగా స్వాధీనం చేసుకుని గతంలో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా, అక్రమార్కులు అధికారుల ఆదేశాలు మాకేం పట్టవన్నట్లు, అక్రమ వ్యాపారానికి అడ్డుకాదంటూ సూచిక బోర్డులు తొలగించారు. ప్రస్తుతం అక్రమ నిర్మాణాలు చేపట్టారు. నిబంధనల ప్రకారం సీలింగ్ భూమిలో వ్యవసాయం తప్పా, మరే ఇతర నిర్మాణాలు, క్రయవిక్రయాలు జరపకూడదు. కానీ సర్వే నంబర్ 780/బీలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా రియల్టర్లు అక్రమ నిర్మాణాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ అధికారులు మాత్రం నోటీసులు జారీ చేయడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్పా, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదు. అక్రమార్కులపై చర్యలు తీసుకోకుండా రెవెన్యూ అధికారులు ఎందుకు ఆలసత్వం వహిస్తున్నారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బహిరంగంగా రియల్టర్ సీలింగ్ భూమిని అక్రమించి, ప్లాట్ ఫర్ సేల్ అంటూ బోర్డులు పెట్టి దందా చేస్తున్నా, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




ప్రభుత్వ భూమిగా రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు (ఫైల్)

అంకిరెడ్డిపల్లిలోని సీలింగ్ భూమిలో అక్రమ నిర్మాణాలు



ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు మొద్దు నిద్రను వీడి రూ. కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేసు నమోదు చేస్తాం



అంకిరెడ్డిపల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని 780/బీలో గల అసైన్డ్ భూమిలో గతంలో లేఔట్ చేసి, ప్లాట్లు విక్రయించారని ఫిర్యాదు రావడంతో అక్రమార్కులకు నోటీసులు జారీ చేశాం. అయినా రియల్టర్లు ఆదేశాలను బేఖాతారు చేసి రియల్ దందా చేపట్టారు. దీంతో భూమిని స్వాధీనం చేసుకున్నాం. ప్రస్తుతం సూచిక బోర్డును ఏర్పాటు చేశాం. అక్రమంగా నిర్మాణాలు చేపట్టారని మా దృష్టికి వచ్చింది. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు అక్రమ నిర్మాణాలను తొలగించి, బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం.

- అశోక్, తహసీల్దార్, కీసర



పోలీసుల అదుపులో నిందితులు, అల్లంవెల్లుల్లి

938 కిలోల కల్తీ అల్లం, వెల్లుల్లి పేస్ట్ పట్టివేత

- 200 కిలోల కుళ్లిన అల్లం, ఎల్లిపాయలు స్వాధీనం
- పోలీసుల అదుపులో నిందితులు

కులకచర్ల, సెప్టెంబరు 25 : కల్తీ అల్లంవెల్లుల్లి పేస్టును తయారు చేసే ముఠాను జిల్లా టాస్క్‌ఫోర్స్ కులకచర్ల పోలీసులు పట్టుకున్నారు. 938 కిలోల కల్తీ అల్లంవెల్లుల్లి పేస్ట్, రెండు క్వింటాళ్ల కుళ్లిపోయిన అల్లంవెల్లిపాయలను స్వాధీనం చేసుకుని నిందితులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో గత సోమవారం చౌడాపూర్‌లో శశిధర్‌కిరాణా దుకాణంలో దాడులు నిర్వహించారు. కల్తీ అల్లంవెల్లుల్లి డబ్బాలు లభించాయి. దీంతో షాపు యజమానిని విచారించగా మహబూబ్‌నగర్‌లోని బాలకృష్ణ, వెంకటేశ్వర్లు దగ్గర కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ఈక్రమంలో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. వీరు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కీసర మండలంలోని దామోదర్‌రెడ్డి దగ్గర తీసుకున్నట్లు తెలిపారు. దీంతో దామోదర్‌రెడ్డిని విచారించారు. బుధవారం కీసరలోని ముకుంద జింజర్ గార్లిక్ పేస్ట్ ఇండస్ట్రీపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో కుళ్లిపోయిన అల్లంవెల్లుల్లి, తయారీకి ఉపయోగించే సిట్రిక్‌యాసిడ్, ఏసిటిక్‌యాసిడ్, టెస్టింగ్‌సాల్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. వివిధ కెమికల్స్ వేసి తయారు చేసిన 938 కేజీల అల్లం వెల్లుల్లి పేస్ట్, 200 కేజీల కుళ్లిపోయిన ఉల్లిపాయలు, మొత్తం 1,138 కేజీలు స్వాధీనం చేసుకున్నారు. శశిధర్, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, దామోదర్‌రెడ్డిలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కొడంగల్ ఆస్పత్రి స్థాయి పెంపునకు కసరత్తు



కొనసాగుతున్న ఆస్పత్రి నిర్మాణ పనులు

● 250 పడకల ఏర్పాటుకు కొనసాగుతున్న పనులు

కొడంగల్, సెప్టెంబరు 25: మెడికల్ కళాశాల నిర్మాణానికి మార్గం సుగమం కావడంతో పనులు వేగంగా చేస్తున్నారు. కొడంగల్ మండలం అప్పాయిపల్లి శివారులోని సర్వే నం.19లో మెడికల్, పశువైద్య కళాశాలల ఏర్పాటుకు 60ఎకరాలు సేకరించారు. కొన్ని రోజులుగా భూ నిర్వాసితులకు పరిహార చెక్కులు, ఇళ్ల స్థలాల పట్టాలను కలెక్టర్ ప్రతీక్‌జైన్, సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి తదితరులు అందించారు. మెడికల్, వైద్య కళాశాలల ఏర్పాటు కానుండడంతో ప్రభుత్వాసుపత్రి స్థాయిపెంపు పనుల వేగం పెరిగింది.

● మెడికల్ కాలేజీకి అనుసంధానంగా ప్రభుత్వాసుపత్రి

ప్రస్తుత ప్రభుత్వాసుపత్రి 250 పడకల వరకు స్థాయిని మెడికల్ కళాశాలకు అనుసంధానించారు. 50పడకల ఈ ఆసుపత్రిని 250పడకలకు పెంచుతున్నారు. ఆసుపత్రి పాత భవనాన్ని తొలగించి కొత్తగా నిర్మిస్తున్నారు. మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు సైతం త్వరలోనే ప్రారంభం కానుండటంతో పనులను వేగంగా చేస్తున్నారు. అక్టోబరులో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ పర్యటనలో భాగంగా మెడికల్, పశువైద్య కళాశాలల పనులను ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు ముమ్మరం చేస్తున్నారు.

పంచాయతీల బిల్లులపై ప్రభుత్వం ఆరా



తాండూరు, సెప్టెంబరు 25: గ్రామ పంచాయతీల్లో నెలల పాటు పెండింగ్‌లో ఉన్న బిల్లులపై ప్రభుత్వం ఆరా తీస్తోంది. బిల్లుల వివరాలు కోరుతూ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్.. కలెక్టర్లకు ఉత్తర్వులను జారీ చేశారు. తాండూరు రెవన్యూ డివిజన్‌లోని 7మండలాల్లో 260 పంచాయతీలున్నాయి. 11 అంశాలతో కూడిన ప్రొఫార్మాను సీపీఆర్ అధికారులు పంపారు. మండలం పేరు, పెండింగ్ బిల్లు గ్రాంట్, పని పేరు అంచన వ్యయం, తదితర బిల్లుల వివరాలను ప్రభుత్వం అడిగింది. ఈ బిల్లులన్నీ గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పనులవే. వీలైనంత త్వరగా బిల్లులు చెల్లించేలా వివరాలు ఇవ్వాలని సర్క్యులర్‌లో ప్రభుత్వం పేర్కొంది.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పీవీ గీతాలక్ష్మీపట్నాయక్

వికారాబాద్, సెప్టెంబరు 25: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని తల్లిదండ్రులకు, అధ్యాపకులకు పేరు తీసుకురావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పీవీ.గీతాలక్ష్మి అన్నారు. బుధవారం క్లబ్‌హాల్‌లో ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి, రవీందర్, రాధిక, మల్లయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికులకిచ్చిన హామీలను అమలు చేయాలి

నవాబుపేట, సెప్టెంబరు 25 : ప్రభుత్వం కార్మికులకిచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆర్.మహిపాల్ అన్నారు. బుధవారం నవాబుపేటలో జిల్లా మహాసభల పోస్టర్‌ను విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కుమార్, అంజయ్య, శివరాజ్, శివకుమార్, శ్రీను, గోపాల్, దుర్గయ్య, అంజయ్య, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు తోటకూర వజ్రేష్‌యాదవ్

రైతులందరికీ 15రోజుల్లో రుణమాఫీ

ఘట్‌కేసర్, సెప్టెంబరు 25: ఘట్‌కేసర్ సొసైటీ పరిధిలో 1,230 రైతులు రుణాలు తీసుకున్నారని కాంగ్రెస్ మేడ్చల్ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం పట్టణంలోని నారాయణ గార్డెన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొందరి రైతుల ఖాతాలు ఈ-కేవైసీ కాక రుణమాఫీ కాలేదన్నారు. సమస్యను అధికారులకు వివరించామన్నారు. వచ్చే 15 రోజుల్లో ఈ 1,210మంది రైతులకు రుణమాఫీ చేస్తామని తెలిపారు. కొందరు రాజకీయం చేస్తూ రుణమాఫీపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో గలాటా సృష్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి, వైస్‌చైర్మన్ అనంతరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య, హైదరాబాద్ ఏఎంసీ డైరెక్టర్ మశ్చేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం బలోపేతానికి కృషి చేయాలి

కొడంగల్, సెప్టెంబరు 25 : సీపీఎం బలోపేతానికి కృషిచేయాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య అన్నారు. బుధవారం కొడంగల్ లోని గెస్ట్‌హౌస్‌లో నిర్వహించిన 3వ మహాసభల్లో ఆయన పాల్గొన్నారు. సీపీఎం మహాసభలు మూడేళ్లకోసారి గ్రామస్థాయి నుంచి అఖిల భారత కమిటీ వరకు నిర్వహిస్తామన్నారు. పాలకులిచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులందరికీ రుణమాఫీ పూర్తిచేయాలని, ఆరు గ్యారంటీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇళ్లను వెంటనే ప్రారంభించి అప్పగించాలన్నారు. ప్రజా సమస్యలపై సీపీఎం పోరాడుతుందన్నారు. బొంరాస్‌పేట్, దౌల్తాబాద్, కొడంగల్‌మండలాల సీపీఎం నూతన కార్యదర్శులను ఎన్నుకున్నారు. నాయకులు బి.చంద్రయ్య, మల్లప్ప, సత్యానందం, రాములు, మోహన్, సాయికుమార్, అంజయ్య, సాయిదాస్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

బషీరాబాద్, సెప్టెంబరు 25 : గ్రామాల్లో తాగునీటి సరఫరా సహాయకులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని తాండూరు డీఎల్పీవో శంకర్‌నాయక్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామీణ నీటి సరఫరా విభాగం(మిషన్ భగీరథ) ఆధ్వర్యంలో రెండో రోజు వాటర్‌మెన్ శిక్షణకు డీఎల్పీవో హాజరై మాట్లాడారు. తాగునీటి నాణ్యతను నిత్యం పరీక్షించాలన్నారు. బోరు బావులు, పైపులైన్ల మరమ్మతులపై పూర్తి శిక్షణ తీసుకోవాలన్నారు. గ్రామాల్లో నీటి సరఫరాలో ఇబ్బందులుంటే పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఆంజనేయులు, ఈఈ చల్మారెడ్డి, మిషన్ భగీరథ డీఈఈ తేజబాబు, గ్రిడ్ డీఈఈ విజయ్‌కుమార్, ఎంపీడీవో విజయ్‌కుమార్, ఏఈ సాయిప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తి చాటాలి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబర్ 25 : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటాలని బీఆర్ఎస్ నాయకుడు కానుగంటి శ్రీనివాస్, ప్యాక్స్ డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి అన్నారు. ఎదులాబాద్ జెడ్పీ పాఠశాలలో బుధవారం క్రీడాకారులకు జెర్సీలను అందజేశారు. చదువు, క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మంకం రవి, నాయకులు శ్రీనివాస్, నాగేష్, వెంకటేష్, నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

శామీర్‌పేట, సెప్టెంబర్ 25 : అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ రాంచదర్‌యాదవ్ డిమాండ్ చేసారు. బుధవారం అక్రమ నిర్మాణాలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. తూంకుంట ఆరోవార్డులో కౌన్సిలర్ గుంతల లక్ష్మి క్రిష్టారెడ్డి తన భూమిలో అనుమతి లేకుండా బిల్డింగ్ నిర్మించుకున్నాడని తెలిపారు. ప్రజాప్రతినిధులే నిబంధనలు పాటించలేదన్నారు. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ నిర్మాణ ఫిర్యాదుపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్ తెలిపారు.

అందరికీ రుణమాఫీ చేయాలి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 25 : ప్రభుత్వం రైతులందరికీ రుణమాఫీ చేయకుండా ఇబ్బందులకు గురిచేయడం సరి కాదని, అర్హులందరికీ వెంటనే మాఫీ వర్తింపజేయాలని మాల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం ఘట్‌కేసర్ సొసైటీ సమావేశానంతరం మొదట రైతులతో, అనంతరం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీపై ప్రశ్నిస్తున్న రైతులను అరెస్టులు చేయించడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇస్తామన్నదే కదా రైతులు అడుగుతున్నారని ఎంపీ అన్నారు. ఎన్నికలకు ముందు ఒకటి, గెలవగానే మరోటి మాట్లాడటం అన్యాయమన్నారు. అర్హులైన ప్రతీ రైతుకు 2లక్షల రుణమాఫీ చేయాల్సిందే అన్నారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ రాంరెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 25 : వరికి కాండం తొలుచుపురుగు రాకుండా రైతులు అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏవో ఎంఏ బాసిత్ తెలిపారు. మాదారం, ఎదులాబాద్, కొర్రెముల, ప్రతాప్‌సింగారం గ్రామాల్లో బుధవారం పర్యటించి వరిపైర్లు పరిశీలించారు. కాండం తొలుచు పురుగును గమనించినట్లు తెలిపారు. రైతులు యూరియా వాడకం నిలిపేయాలని సూచించారు. కాపర్ హైడ్రాక్సైడ్ 20గ్రాములు, స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ 0.4గ్రాములు ప్రతీ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. పోటాష్ ఎరువును ఎకరానికి 15నుంచి 20కిలోలు చల్లాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు జగదీష్, మంజుల, రైతులు రాజిరెడ్డి, శ్రవణ్, బాలరాజు, లింగం, కొమురయ్య పాల్గొన్నారు.

రూ.20లక్షలతో పార్కు ప్రహరీ నిర్మాణం

కీసర రూరల్, సెప్టెంబరు 25 : మున్సిపాలిటీని అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తున్నామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. బుధవారం 6, 7వార్డుల్లో రూ.20లక్షలతో చేపట్టిన పార్కు ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్‌యాదవ్, కమిషనర్ రాజేందర్‌కుమార్, కౌన్సిలర్లు అనంతరెడ్డి, డీఈఈ సుదర్శనం రఘు, నాయకులు ఆంజనేయులుగౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో మట్టి తవ్వకాలు

తాండూరు రూరల్, సెప్టెంబరు 25: అంతారంలోని అసైన్డ్ భూముల్లో అక్రమార్కులు భారీగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. దర్జాగా ఎర్ర మట్టి తవ్వేసి టిప్పర్లతో అమ్ముకుంటున్నారు. అంతారం-కోట్‌పల్లి రోడ్డులో కొందరు రైతులకు గతంలో ప్రభుత్వ భూమి పంచింది. ఓ నిరుపేద రైతుకు ఎవరూ అండగా లేకపోవడంతో సర్వే నంబర్-58లో తవ్వకాలు చేపడుతున్నారు. రాజకీయ అండతో కాంట్రాక్టర్ రైతును బెదిరిస్తూ, పోలీసులను మేనేజ్ చేస్తూ మట్టి తవ్వేస్తున్నాడని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు మట్టి తవ్వకాన్ని అడ్డుకోవాలని అంతారం వాసులు కోరుతున్నారు.

ఓటరు సవరణ ప్రక్రియను పూర్తి చేయాలి

చేవెళ్ల, సెప్టెంబరు 25 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఓటరు జాబితా సవరణపై ఇంటింటి సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని ఆర్డీవో సాయిరాం తెలిపారు. బుధవారం మండల పరిధిలోని కమ్మెట గ్రామంలో ఓటరు జాబితా సవరణపై ఇంటింటి సర్వేలో భాగంగా ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఓటరు జాబితా లిస్టులో పేర్లు పరిశీలించుకోవాలన్నారు. చనిపోయిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించాలని సూచించారు. డబుల్ ఓట్లు ఉన్నవాటిని సైతం తొలగించాలన్నారు. తహసీల్దార్ కృష్ణయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కుండపోత

- సిరిపురంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వీరన్నవాగు
- చీలాపూర్‌లో విరిగిపడిన కొండచరియ
- అలుగు పారిన బొంరాస్‌పేట్ పెద్ద చెరువు


సిరిపురంలో పారుతున్న వీరన్నవాగు


అలుగు పారుతున్న బొంరాస్‌పేట్ పెద్ద చెరువు

మర్పల్లి/పూడూరు/బొంరాస్‌పేట్, సెప్టెంబరు 25: మర్పల్లి మండలంలో భారీ వర్షం కురిసింది. రెండు రోజులుగా కురిసిన వానలతో పంట పొలాల్లో నీరు చేరడంతో తీరని నష్టం జరిగింది. పలు గ్రామాల్లో ఇళ్ల మధ్యలో వరద నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. బుధవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో సిరిపూరం వీరన్న వాగు ఉధృతంగా ప్రవహించింది. మర్పల్లి-మోమిన్‌పేట్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. వర్షాలు ఇదే విధంగా కురిస్తే పంటలకు తీరని నష్టం జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. పూడూరు మండల పరిధిలోని చీలాపూర్ గ్రామంలో మంగళవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గ్రామంలో తులసమ్మ అనే మహిళ కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టింది. కురిసిన వర్షాని బుధవారం తెల్లవారుజామున కొండచరియ విరిగి ఇంటిపై పడడంతో కొంతభాగం పాక్షికంగా కూలింది. బాత్‌రూం, ప్రహరీ పూర్తిగా కూలిపోయింది. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని పెద్ద చెరువు భారీ వర్షానికి అలుగుపారింది. ఇటీవలే కురిసిన ఎడతెరిపి లేని వర్షాలతో చెరువు జలకళను సంతరించుకోగా మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో అలుగు పారింది. చెరువు నిండటంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేశారు. హైదరాబాద్, బీజాపూర్ హైవే మార్గంలో ఉన్న చెరువు అలుగు పారడంతో అటుగా వెళ్లే వాహనదారులు అక్కడికి చేరుకొని సెల్ఫీలు దిగారు.


చీలాపూర్‌లో ఓ ఇంటిపై విరిగిపడిన కొండచరియ

ఆగని అటవీ భూముల ఆక్రమణలు

- అడ్డుకునేందుకు వెళ్లిన అటవీశాఖ అధికారుల బృందం
- టెన్షన్‌తో స్పృహతప్పి పడిపోయిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్
- చికిత్సనిమిత్తం తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలింపు


మైల్వార్ రిజర్వు ఫారెస్ట్‌లో భూ అక్రమణల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

బషీరాబాద్, సెప్టెంబరు 25: మండలంలోని మైల్వార్ రిజర్వు ఫారెస్టులో అటవీభూముల అక్రమణలు ఆగడం లేదు. సమీప గ్రామాల రైతులు కొందరు రాత్రుల్లో అటవీ భూముల్లోకి చొచ్చుకొచ్చి వానాకాలం సాగుకు యత్నిస్తున్నారనే సమాచారంతో తాండూరు ఫారెస్ట్ రేంజర్ ఆదేశాలతో అటవీశాఖ సెక్షన్, బీట్ అధికార సిబ్బంది బుధవారం అడవికి వెళ్లారు. ఈ క్రమంలో అక్కడున్న కొందరిని భూఅక్రమణలపై బీట్ అధికారి మల్లప్ప ఆరా తీస్తూనే, అక్రమణలు ఆగడంలేదనే టెన్షన్‌తో చాతీలో నొప్పి వస్తుందంటూ ఒక్కసారిగా స్పృహ తప్పి కింద పడిపోయాడు. గమనించిన సెక్షన్ అధికారులు స్నేహ, పీర్యానాయక్ తదితరులు తోటి సిబ్బందితో కలిసి కిలోమీటరు అడవి లోపలి నుంచి రోడ్డు వద్దకు మోసుకొచ్చారు. అప్పటికే భూ అక్రమణల ప్రాంతానికి బయలుదేరిన ఫారెస్ట్ రేంజర్ రాజేందర్‌కు సమాచారం ఇవ్వడంతో 108ను అక్కడికి పంపించారు. వెంటనే బాధితుడిని తాండూరు జిల్లా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు చేయించారు. ప్రస్తుతం బీట్ ఆఫీసర్ పరిస్థితి నిలకడగా ఉందని, మెరుగైన వైద్యం కోసం పరీక్షలు నిర్వహించాలని వైద్యులు సూచించారని రాజేందర్ తెలిపారు. భూ అక్రమణలపై కఠినంగా వ్యవహరిస్తున్నా, ఎక్కడో ఒకచోటా భూముల్లోకి చొచ్చుకొచ్చే ప్రయత్నాలు చేస్తున్నారని అటవీశాఖ అధికారులు వాపోతున్నారు. రాత్రుల్లో అక్రమణలకు యత్నిస్తున్నారని, కాపాడేందుకు వెళితే దాడులకు వెనకడటంలేదని వారు పెదవిరిస్తున్నారు.

అటవీభూముల్లోకి చొచ్చుకొస్తే కేసులే

అటవీభూముల్లోకి అక్రమంగా చొచ్చుకొచ్చే యత్నం చేస్తే ఎవరిని కూడా ఉపేక్షించేది లేదని తాండూరు అటవీశాఖ రేంజర్ రాజేందర్ హెచ్చరించారు. మండలంలోని మైల్వార్ రిజర్వు ఫారెస్ట్‌లో నీళ్లపల్లి, ఇస్మాయిల్‌పూర్, మైల్వార్‌తండా పరిధిలో పలుచోట్ల అటవీ భూముల అక్రమణలకు పాల్పడేందుకు యత్నిస్తున్నారనే దానిపై స్పందించారు. అటవీ భూముల సంరక్షణ విషయంలో ఎవరైన ఇబ్బందులు సృష్టించే కేసులు పెట్టి జైలుకు పంపిస్తామన్నారు.

మర్పల్లి ఘటనపై కేటీఆర్ ఆరా

- తెలంగాణ భవన్‌కు పిలిపించుకున్న వర్కింగ్ ప్రెసిడెంట్
- కేసులపై వివరించిన బాధితులు, నాయకులు


బాధితులు ప్రవీన్, నవీన్‌లను వివరాలు అడిగి తెలుసుకుంటున్న కేటీఆర్

వికారాబాద్, సెప్టెంబర్ 25: మర్పల్లి పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు థర్డ్‌డిగ్రీ ప్రయోగించారని, బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆ పార్టీ నాయకులు ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ నాయకులు సైతం స్పీకర్ డౌన్‌డౌన్ అనడాన్ని నిరసిస్తూ వారు ఆందోళన చేయడంతో మర్పల్లిలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను ఫోన్‌చేసి ఈ విషయంపై ఆరా తీశారు. ఉదయం బాధితులు, బీఆర్ఎస్ నాయకులతో తెలంగాణ భవన్‌కు రావాలని చెప్పడంతో నాయకులు కేటీఆర్‌ను కలిశారు. పట్లూర్‌కు చెందిన ప్రవీన్, నవీన్‌లు కేటీఆర్‌కు విషయంపై వివరించారు. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని మెతుకు ఆనంద్, బీసీ కమిషన్ మాజీ మెంబర్ శుభప్రద్‌పటేల్, పార్టీ మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మధుకర్ కేటీఆర్‌కు వివరించారు. ఈ విషయమై డీజీపీతో, అవసరమైతే స్పీకర్‌తో మాట్లాడుతామని, ఈ విషయంలో ఎవరూ భయపడొద్దని సూచించారు. అనంతరం మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, గోపాల్, చంద్రశేఖర్, మోహన్‌రెడ్డి, రాచన్న, అశోక్, మధుకర్, యాదయ్య, నయాబ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

షాద్‌నగర్, సెప్టెంబరు 25: హిందూ ధర్మపరిరక్షణకు హిందువులంతా జాగృతం కావాలని విశ్వహిందూ పరిషత్, బీజేపీ నేతలు పిలుపునిచ్చారు. పవిత్రమైన తిరుమల లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేయడాన్ని నిరసిస్తూ బుధవారం షాద్‌నగర్ హిందూ ఐక్య వేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి పట్టణ ప్రధాన కూడలిలో ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల ప్రముఖ్ బండారి రమేష్ మాట్లాడుతూ ఒక కుట్రతోనే హిందూ ధర్మంపై దాడి జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందువులంతా ఎంతో పవిత్రంగా భావించే తిరుమల శ్రీవారి లడ్డూలో జంతువుల కొవ్వు, కల్తీ నెయ్యి వాడకం హేయమైన చర్య అని అన్నారు. జగన్ హిందువుల మనోభావాలను దెబ్బతీసేందుకే అన్యమతస్థుడైన వ్యక్తిని టీటీడీ బోర్డు చైర్మన్‌గా నియమించారని ఆరోపించారు. అలాగే తిరుపతి సమీపంలోని చంద్రగిరివద్ద ఇస్లామిక్ విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని, శ్రీశైలంలోనూ అన్యమతస్థుల ప్రచారం పెరిగిపోతుందని, శ్రీశైలం పరిసర ప్రాంతాల్లో పెద్దఎత్తున చర్చిలు నిర్మిస్తున్నారని తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు అందెబాబయ్య మాట్లాడుతూ లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీజేపీ, విశ్వ హిందూ పరిషత్ నేతలు కమ్మరి భూపాలచారి, చెట్ల వెంకటేష్, రిషి, బెజుగం రమేష్, నాయకులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించడం లేదని.. మున్సిపల్ సిబ్బందిపై చైర్మన్ ఆగ్రహం

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 25: షాద్‌నగర్ మున్సిపల్ సిబ్బంది ప్రొటోకాల్ పాటించడం లేదని, ఎమ్మెల్యే కార్యక్రమాలపై సమాచారం ఇవ్వడం లేదని చైర్మన్ కొందూటి నరేందర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో బుధవారం షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరైనారు. కార్యక్రమం ముగిసే సమయానికి వచ్చిన చైర్మన్ నరేందర్ అక్కడే ఉన్న కమిషనర్ వెంకన్న, ఇతర సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీ కార్యక్రమాలకు ఎమ్మెల్యే వచ్చే విషయం ఎందుకు చెప్పడం లేదని నిలదీశారు. తాను, కౌన్సిలర్లు సకాలంలో రాకపోతే ఉద్దేశపూర్వకంగానే రావడం లేదని ఎమ్మెల్యే అనుకునే అవకాశం ఉంటుందిగా అని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పార్టీలు పక్కన పెడితే ఆయన మాకు కూడా ఎమ్మెల్యే, పట్టణాభివృద్ధి కోసం ఆయన వద్దకు తాము పోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమాలకు తాము హాజరు కాకపోతే ఆయన అభివృద్ధికి ఎలా సహకారం అందిస్తారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వస్తున్న సమచారాన్ని ముందస్తుగా ఒక చైర్మన్‌గా తనకు ఎందుకు చెప్పడం లేదో స్పష్టం చేయాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక ముందు ఇలాంటి నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తే తాను ఏమాత్రం సహించబోనని నరేందర్ హెచ్చరించారు.

జీపీ బిల్లుల విడుదలకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలి


ఈటలకు వినతిపత్రం ఇస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్, సెప్టెంబరు 25: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా తాజా మాజీ సర్పంచులకు రావలసిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించేలా చూడాలని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, జేఏసీ అధ్యక్షుడు సర్వి యాదయ్యగౌడ్, ఎంపీ ఈటల రాజేందర్‌ను కోరారు. ఈమేరకు బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో రాజేందర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశానుసారం 2019 నుంచి 2024వరకు గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు. బిల్లులు విడుదల చేయకపోవడంతో అప్పులు చేసి చెల్లించినట్లు సర్పంచుల సంఘం నాయకులు ఈటలకు వివరించారు. బిల్లులు చెల్లించకపోవడంతో అనేక మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు, పంచాయతీ కార్మికుల బకాయి వేతనాలు వెంటనే విడుదల చేసేలా ఒత్తిడి తెస్తానని ఈటల హామీ ఇచ్చినట్లు లక్ష్మీనర్సింహారెడ్డి తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు మధుసూధన్‌రెడ్డి, ముదోల్ రాజేందర్, మాట్ల మధు, తోటపురి బీరప్ప, కర్ణాకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ దళితుల వ్యతిరేకి

- బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబేడ్కర్
- అమెరికాలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై మండిపాటు

మొయినాబాద్ రూరల్, సెప్టెంబరు 25: దేశంలోని దళితుల పట్ల కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకంగా వ్యవహరిస్తోందని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబేడ్కర్ ఆరోపించారు. బుధవారం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలోని బీజేపీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందారని, తమ ప్రభుత్వం రాగానే రిజర్వేషన్లను ఎత్తివేయడం జరుగుతుందని అమెరికాలో ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పెద్దలు పార్లమెంటు ఎన్నికల సమయంలో బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను ఎత్తివేస్తారని భయంకరమైన ప్రకటనలు చేశారని ఆరోపించారు. రాహుల్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోకపోతే బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. నామినేటెడ్ కార్పొరేషన్ చైర్మన్ పదవుల్లో దళితులకు సముచిత న్యాయం కల్పించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాకు చెందిన స్పీకర్ ఈ విషయంలో ఎందుకు స్పందించడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే రత్నం, కంజర్ల ప్రకాష్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జ్ఞానేశ్వర్, కార్యదర్శి నర్సింగ్‌రావు, నాయకులు పురుషోత్తం, రవి, ప్రతాప్, రమేష్, పద్మ, మనోహర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు అడవి పందుల బెడద

- ఆందోళనలో రైతన్నలు


అడవి పందులు ధ్వంసం చేసిన పంట

యాచారం, సెప్టెంబరు 25 : మండలంలోని పలు గ్రామాల్లో అడవి పందులు చేతికందిన పత్తి, జొన్న పంటలను పాడు చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 450 ఎకరాల్లో పత్తి, జొన్న పంటలను అడవి పందులు పాడు చేశాయని వాపోతున్నారు. ధర్మన్నగూడలో బుధవారం పగటి వేళ అడవిపందులు పంటను పాడు చేశాయని వాటిని బయటకు పంపడానికి యత్నించగా రైతు ఐలయ్య, మల్లేష్‌లపై దాడికి యత్నించడంతో భయంతో దూరంగా పరిగెత్తారు. అయితే, పత్తి చేనులో అడవి పందులు ఈనిపిల్లలతో పాటు అక్కడే ఉంటున్నాయని రైతులు చెబుతున్నారు. ధర్మన్నగూడలో ఐలయ్యకు చెందిన పత్తిచేను దాదాపు ఎకరం పూర్తిగా పాడు చేశాయని ఆవేదన తెలిపాడు. మరో ఎకరం పొలంలో కంది పంటను పాడు చేశాయని మల్లేష్ అనే రైతు చెప్పాడు. చిన్నతూండ్లలో వినోద్‌కుమార్‌కు చెందిన ఎకరం జొన్నపంటను పాడు చేశాయని తెలిపాడు. మేడిపల్లిలో యాదయ్యకు చెందిన ఎకరంన్నర పొలంలో పత్తి పంటను పూర్తిగా ధ్వంసం చేశాయని, అడవి పందుల బెడద నుంచి తమకు రక్షణ కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఎకరం పొలంలో పంట పాడైంది

ఐదెకరాల పొలం కౌలుకు తీసుకొని పత్తి పంట వేశాను. రూ.4.25లక్షల అప్పు చేశా. అడవి పందులు ఎకరం పొలంలో పంటను పూర్తిగా ధ్వంసం చేశాయి. వాటిని పొలంలోకి రాకుండా అడ్డుకునేందుకు యత్నించడంతో దాడి చేసేందుకు వస్తున్నాయి. అటవీ శాఖ అధికారులే అడవిపందుల నుంచి రక్షణ కల్పించాలి. వాటిని చంపితే కేసులు పెట్టే అధికారులు ఏం చేస్తారో సమాధానం చెప్పాలి.


- ఐలయ్య, రైతు, ధర్మన్నగూడ

ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

తాండూరు రూరల్, సెప్టెంబరు 25 : తెలంగాణ -కర్ణాటక సరిహద్దులోని కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కర్ణాటక మాజీ మంత్రి అరవింద లింబావళి అన్నారు. బుధవారం ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిలు, నవీన్‌రెడ్డిలతో సమీక్షించారు. వచ్చే 3, 4వ తేదీల్లో ఆరుగురు కేరళ వేదపండితులు ఎల్లమ్మ ఆలయాన్ని సందర్శిస్తారని తెలిపారు. వారి సూచనలు, సలహాల మేరకు ఆలయాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ఆలయ సమీపంలోని పట్టా భూములిచ్చేందుకు రైతులు ముందుకు వస్తే కొనుగోలు చేస్తామన్నారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి కూడా ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తరఫున సహకరించాలని కోరారు. కాగా వచ్చేనెల 3న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో పాలకవర్గం ప్రమాణస్వీకారం చేస్తుందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో చించోళి తాలూకా బీజేపీ నాయకులు శ్యాంపవార్, పూజారి శ్రీనివాస్, వెంకట్‌రాంరెడ్డి, లాలయ్యగౌడ్, రాజు, శాంతప్ప, లక్ష్మి పాల్గొన్నారు.

డీసీపీ నుంచి ఎస్సైకి ప్రశంసాపత్రం

తాండూరు రూరల్, సెప్టెంబరు 25: తాండూరు మండలం కరన్‌కోట్ ఎస్ఐ పి.విఠల్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ డీజీపీ కార్యాలయంలో డీజీపీ జితేందర్ నుంచి ప్రశంశాపత్రం అందుకున్నారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించడం, కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవడం వంటి వాటిలో కరన్‌కోట్ రాష్ట్రంలోనే టాప్-10 జాబితాలో ఉండడంతో ప్రశంశాపత్రాన్ని అందుకున్నారు. మరింత అంకితభావంతో పనిచేస్తామని ఎస్సై తెలిపారు.

అక్టోబరు 1 వరకు వయోవృద్ధుల సంక్షేమ దినోత్సవాలు

వికారాబాద్, సెప్టెంబరు 25 : అక్టోబరు 1న అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నుంచి అక్టోబరు 1 వరకు వయోవృద్ధుల సంక్షేమ దినోత్సవాలను నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ అధికారి బి.కృష్ణవేణి బుధవారం తెలిపారు. వృద్ధులకు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు, తల్లిదండ్రుల పోషణ చట్టం-2007పై అవగాహన కల్పిస్తామన్నారు.

ఘట్‌కేసర్‌లో ఫార్మసీ వారోత్సవాలు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 25: ఫార్మసీ వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం కొండాపూర్‌లోని సంస్కృతి ఫార్మసీ కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 25వరకు ఫార్మసీ వారోత్సవాలను నిర్వహించామన్నారు. పాఠశాలల విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించినట్లు వివరించారు. ఘట్‌కేసర్‌లో ర్యాలీ నిర్వహించి చౌరస్తాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు.

కడ్తాల్ జీపీ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్!

- ఐఎల్‌యూపీ రూపకల్పనలో డీటీసీపీ అధికారులు

కడ్తాల్, సెప్టెంబరు 25 : కడ్తాల్ గ్రామపంచాయతీ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపకల్పనలో భాగంగా ఇండికేటివ్‌ల్యాండ్ యూజ్ ప్లాన్‌కు పట్టణాభివృద్ధి శాఖ అధికారులు ముసాయిదా రూపకల్పన చేస్తున్నారు. భూవినియోగ రూపకల్పన ఐఎల్‌యూపీలో భాగంగా కడ్తాల సమాచారాన్ని కొంతకాలంగా సేకరిస్తున్నారు. కడ్తాల్ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పక్కగా సమగ్రంగా ప్రణాళికల రూపకల్పన చేయాల్సి ఉంది. బుధవారం పట్టణాభివృద్ధి శాఖ అసిస్టెంట్ రీజినల్ డైరెక్టర్ సత్యభామ టీపీవో సువర్ణ గ్రామపంచాయతీ కార్యాలయానికి చేరుకొని సమాచారాన్ని సేకరించారు. గ్రామ రెవెన్యూ మ్యాప్‌ను పరిశీలించారు. కాగా, అధికారులు స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఓ స్థానిక వెంచర్ ప్రతినిధులతో సమావేశం కావడం, వివరాలు సేకరించడం వివాదాస్పదంగా మారింది. పలు అనుమానాలకు తావిస్తోంది. ప్రభుత్వ చెరువు, కుంటలను ఆక్రమించిన సంస్థ ప్రతినిధులతో అధికారులు వివరాలు సేకరించడం ఏమిటని కడ్తాల్ మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ అభ్యంతరం తెలిపారు. దాంతో వెంచర్ ప్రతినిధులు అక్కడి నుంచి జారుకున్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతానని ఆనంద్ పేర్కొన్నారు.

వేంకటేశ్వరుడి సేవలో ఆర్పీ పట్నాయక్

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 25: ప్రముఖ సినీ సంగీత దర్శకుడు, నటుడు ఆర్పీ పట్నాయక్ షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని బుధవారం దర్శించుకొని పూజలు చేశారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ సభ్యులతో కలిసి కర్నూల్‌కు వెళ్తూ మార్గమధ్యలో పురాతన వేంకటేశ్వర ఆలయం ఉందని తెలుసుకుని వచ్చారు. దాతల సహకారంతో మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు చేపట్టిన అభివృద్ధిని చూసి ఆర్పీ ఆనందం వ్యక్తం చేశారు. సప్త ఆలయ సముదాయంలోని వేంకటేశ్వరుడి దర్శించుకున్న పట్నాయక్‌ను పూజారులు సన్మానించి, ఆశీర్వదించారు. షాద్‌నగర్ పట్టణంలో గొప్ప పురాతన ఆలయం ఉండడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో ఆలయానికి అవసరమైన సహకారం అందిస్తానని పట్నాయక్ తెలిపారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ అధ్యక్షుడు రాజేంద్ర పల్నాటి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ గాదిరాజు శ్రవంతి, ఆలయ అభివృద్ధి సేవా సభ్యులు పి.వెంకటసాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, కానుగు రాంభూపాల్ తదితరులు పాల్గొన్నారు.


వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆర్పీ పట్నాయక్, తదితరులు

బాలింతలకు పోషకాహారం ఇవ్వాలి


తాండూరు రూరల్: ఐసీడీఎస్‌లో మాట్లాడుతున్న ఎంపీడీవో విశ్వప్రసాద్

తాండూరు రూరల్, సెప్టెంబర్ 25: గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహారాలు అందివ్వాలని ఎంపీడీవో విశ్వప్రసాద్ పేర్కొన్నారు. తాండూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణమాసం కార్యక్రమంలో మాట్లాడారు. 0-6ఏళ్ల పిల్లలకు, గర్భిణులు, బాలింతలకు పోషకాలు ఇస్తూ తగు జాగ్రత్తలపై సూచనలివ్వాలన్నారు. రక్తహీనత లేకుండా చూడాలన్నారు. పిల్లల పోషణపై ప్రతీ నెల సమీక్ష చేయాలన్నారు. ఏపీఎం ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో చదువుతున్న ప్రీ స్కూల్ పిల్లలకు యూనిఫాం కుట్టించామన్నారు. కార్యక్రమంలో సీడీపీవో కాంతారావు, ఏసీడీపీవో శ్రీలక్ష్మీ, సెక్టార్ సూపర్ వైజర్‌లు నిర్మల, సుశీల, సునీత, మీనాక్షి, జ్యోతి, రాణి పాల్గొన్నారు.

మర్పల్లి: రోజూ పోషకాహారం తీసుకుంటేనే పుట్టబోయే శిశువులు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీవో ప్రవీణ అన్నారు. మర్పల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. పోషకాహార లోపం ఉన్న వారిని 40 మందిని గుర్తించినట్లు వివరించారు. వారికి నిత్యం పోషకాహారం ఇస్తామన్నారు. చిన్నారుల్లో ఎదుగుదల లేకుంటే తాండూర్‌లోని ఎన్ఆర్‌సీ కేంద్రానికి తరలిస్తే ప్రత్యేక వైద్యం అందిస్తారన్నారు. అంగన్‌వాడీల్లో అందించే పౌష్టికాహారాన్ని తప్పక తినాలన్నారు. కూరగాయలు, పండ్లు, గుడ్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రిజ్వానా, టీచర్‌లు, ఆయాలు పాల్గొన్నారు.

కులకచర్ల: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని పరిగి సీడీపీవో మెహరున్నీసా తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం సందర్భంగా బాలింతలు, గర్భిణులతో సమావేశం నిర్వహించారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ దేవి, అంగన్‌వాడీ టీచర్లు పద్మ, అనసూయ, లలిత తదితరులు పాల్గొన్నారు.


మర్పల్లి: సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ప్రవీణ


కులకచర్ల: అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న పరిగి సీడీపీవో మెహరున్నీసా బేగం

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం


ఆర్థిక సాయం అందిస్తున్న కృష్ణంరాజు

కొడంగల్, సెప్టెంబరు 25: కొడంగల్ పట్టణ పరిధి 12వ వార్డులో ఇటీవల మృతిచెందిన వడ్ల మమత, ఫహీమ్ కుటుంబాలకు యూత్ కాంగ్రెస్ జాతీయ కో-ఆర్డినేటర్ కృష్ణంరాజు ఆర్థిక సహాయం అందించారు. బుధవారం వార్డులో కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాము, రమేశ్ కృష్ణంరాజు, రమేశ్, వెంకటేశం, వెంకటయ్య పాల్గొన్నారు.

మునిసిపల్ పన్నుల వసూళ్లకు డ్రైవ్


ఇంటి ట్యాక్స్ వసూలు చేస్తున్న బిల్ కలెక్టర్లు

వికారాబాద్, సెప్టెంబరు 25 : మునిసిపల్ పరిధిలో పన్ను బకాయిల వసూళ్లకు సామూహిక డ్రైవ్ నిర్వహిస్తున్నామని ఆర్‌వో జాన్ కృపాకర్ తెలిపారు. బుధవారం ఇంద్రానగర్ కాలనీలో ఇంటిపన్ను, నల్లా బిల్లు పన్నులు వసూళ్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రామకృష్ణ, బిల్‌కలెక్టర్లు అశోక్, అరుణ్, జగదీశ్, మహిపాల్, చందర్‌సింగ్, సురేష్, సాయికుమార్, సోమయ్య పాల్గొన్నారు.

పలు మండలాలకు నూతన ఎంఈవోలు

పరిగి/దోమ/కులకచర్ల/మోమిన్‌పేట్/బొంరాస్‌పేట్, సెప్టెంబరు 25: పరిగి మండల ఇన్‌చార్జి ఎంఈవోగా ఎం.గోపాల్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంఈవో హరిశ్చందర్ మేడ్చల్ జిల్లా బాలానగర్‌కు బదిలీ అయ్యారు. పరిగి జడ్పీహెచ్ఎస్ నం:01 హెచ్ఎంగా పనిచేస్తున్న గోపాల్‌కు ఎంఈవోగా బాధ్యతలు అప్పగించారు. ఆయనకు ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్వాగతం పలికి సన్మానించారు. దోమ మండల నోడల్ అధికారి బొంపల్లి పాఠశాల జీహెచ్ఎం వెంకట్‌కు ఎంఈవోగా బాధ్యతలు అప్పగించారు. ఎంఈపడీవో మహేష్ బాబు ఆయనకు నియామకపత్రం అందించారు. ఎంఈవో వెంకట్‌ను ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. చౌడాపూర్ నూతన ఎంఈవోగా రామచంద్రయ్య నియమితులయ్యారు. మందిపాల్ పాఠశాల జీహెచ్ఎంగా ఉన్న ఆయన ఇన్‌చార్జి ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు కులకచర్ల ఎంఈవో హబీబ్ అహ్మద్ ఇన్‌చార్జిగా ఎంఈవోగా పనిచేశారు. మోమిన్‌పేట్ నూతన ఎంఈవోగా మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల హెచ్ఎం మల్లేశం నిమమితులయ్యారు. అలాగే బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల నూతన ఎంఈవోలుగా హరిలాల్, విజయరామారావు బాధ్యతలు స్వీకరించారు. బొంరాస్‌పేట్ జెడ్పీ స్కూల్ జీహెచ్ఎం హరిలాల్, దుద్యాల జడ్పీహెచ్ఎస్ జీహెచ్ఎంగా విజయరామారావు విధులు నిర్వహిస్తున్నారు. నూతన ఎంఈవోలను ఉపాధ్యాయ సంఘాల నాయకులు, టీచర్లు ఘనంగా సత్కరించారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

పెద్దేముల్, సెప్టెంబరు 25 : ఉచితవైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పీసీసీ ప్రధానకార్యదర్శి దారాసింగ్ అన్నారు. గొట్లపల్లిలో బుధవారం లొంక నర్సిములు యువసేన ఆధ్వర్యాన మహావీర్ ఆస్పత్రి సౌజన్యంతో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దారాసింగ్ మాట్లాడుతూ ప్రజలకు సేవచేయాలనే ఉద్దేశంతో లొంక నర్సిములు వైద్య శిబిరం ఏర్పాటు చేయించారని, సేవా కార్యక్రమాలు ఇంకా చాలా చేయాలని కోరారు. నర్సిములు మాట్లాడుతూ పేదరికంతో చాలా మంది అనారోగ్యం ఏర్పడినా ఆస్పత్రులకు వెళ్లలేకపోతున్నారని, పేదల కోసమే తాను ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయించానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఉత్తంచంద్, ఎల్లారెడ్డి, ప్రవీణ్(కుమార్)గుప్తా, మల్లప్ప, చెంద్రప్ప, రఫీ, లొంక రాములు, యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నాయకులు

రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ


ఘట్‌కేసర్ సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్, సెప్టెంబరు 25 : రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తుందని, ఈ విషయంలో ఎవరూ ఆందోళన చెందొద్దని మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఘట్‌కేసర్‌లోని నారాయణ గార్డెన్‌లో ప్యాక్స్ చైర్మన్ సింగిరెడ్డి రాంరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఘట్‌కేసర్ సహకార సంఘం 44వ సర్వసభ్య సమావేశంలో సుధీర్‌రెడ్డి మాట్లాడారు. సాంకేతిక కారణాల వల్లే కొందరికి రుణమాఫీ ఇంకా కాలేదన్నారు. మండల రైతులకు లేని ఇబ్బంది బీఆర్ఎస్, బీజేపీ నాయకులకే వచ్చిందని హేలనగా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతల ప్రభుత్వమన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్షలు రుణమాఫీ చేస్తామని చెప్పి నాలుగేళ్లు కాలయాపన చేసిందన్నారు. బీజేపీ నాయకులు ఒక్కో జన్‌ధన్ ఖాతాలో రూ.15లక్షలు వేస్తామని చెప్పి ఏం చేశారని ప్రశ్నించారు. రైతు సమస్యలపై చర్చించకుండా రాద్ధాంతం చేయడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే ఎజెండా పూర్తి కాగానే సమావేశం రసాభాసగా సాగింది. బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు రుణమాఫీ ఏమైందని ప్రశ్నిస్తూ ఆందోళన చేశారు. చైర్మన్ నచ్చజెప్పినా వినలేదు. పోలీసులు వచ్చి వారిని పక్కకు తీసుకుపోయారు. సుధీర్‌రెడ్డి మాట్లాడుతుండగా మరోసారి లొల్లి చేశారు. వేదికను చుట్టుముట్టారు. పోలీసులు వారిని పక్కన కూర్చోబెట్టారు. ఒకవైపు ప్రసంగాలు, మరోవైపు నిరసనలతో సమావేశం ముగిసింది. కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్‌చంద్రారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్, డీసీవో వెంకట్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బద్దం అనంతరెడ్డి, ఎండీ రాహుల్‌రాజ్, డెరెక్టర్లు లక్ష్మారెడ్డి, పోచిరెడ్డి, స్రవంతి, మహేందర్, ధర్మారెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్, రమేష్, బాల్‌రాజ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఘనంగా దీన్ దయాళ్ జయంతి వేడుకలు


దీన్ దయాళ్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

మేడ్చల్ టౌన్/తాండూరు సెప్టెంబరు 25: పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బుధవారం గుండ్లపోచంపల్లి పరిధి మైసమ్మగూడలో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ హాజరయ్యారు. దీన్‌దయాళ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు కృష్ణాగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు మల్లికార్జున్, సరస్వతి, హంస రాజీకృష్ణాగౌడ్ పాల్గొన్నారు. పండిత్ దీన దయాల్ ఉపాధ్యాయ జయంతిని తాండూరులో బీజేపీ పట్టణ అధ్యక్షులు నాగారం మల్లేశం ఆధ్వర్యంలో నిర్వహించారు. దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్, శాంత్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, భద్రేశ్వర్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీహరి పాల్గొన్నారు.


తాండూరులో దీనదయాల్ ఉపాధ్యాయ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాల పంపిణీ


బొంరాస్‌పేట్: గ్యాస్ సబ్సిడీ పత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

బొంరాస్‌పేట్/కులకచర్ల/కొడంగల్, సెప్టెంబరు 25: బొంరాస్‌పేట్ మండలంలోని బొట్లవని తండా గ్రామ పంచాయతీ పరిధిలో ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాల్లో రూ.500కే గ్యాస్ సబ్సిడి గుర్తింపు పత్రాలను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బుధవారం వైస్ ఎంపీపీ దేశ్యానాయక్, మాజీ సర్పంచ్ మెగ్యానాయక్ సమక్షంలో లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో దేవులనాయక్, తండావాసులు గోపాల్, పిన్యనాయక్, కాలునాయక్, శంకర్ పాల్గొన్నారు. ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ అందిస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి తెలిపారు. కులకచర్ల మండలం కుసుమసముద్రం, గోరిగడ్డ తండాల్లో సబ్సిడీ పత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్-2 అధ్యక్షుడు భరత్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు, కార్యదర్శి గోపాల్‌నాయక్, పార్టీ నాయకులు రవినాయక్, ఆనంద్, కేశవులు పాల్గొన్నారు. కొడంగల్‌లోని గాంధీనగర్ కాలనీలో యూత్ కాంగ్రెస్ జాతీయ కో-ఆర్డినేటర్ కృష్ణంరాజు లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని తప్పక అమలు చేస్తుందన్నారు. రాబోయే రోజుల్లో మహిళల కోసం మరిన్ని సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని ఆయన భరోసా ఇచ్చారు.

బెల్టు షాపులను మూసివేయాలి


వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకుడు మహేష్

బంట్వారం, సెప్టెంబరు 25 : బెల్టు షాపులను వెంటనే మూసివేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు బుధవారం బంట్వారం తాహసీల్దారు వియయ్‌కుమార్, ఎంపీడీవో రాములు, ఎస్సై మహిపాల్‌రెడ్డిలకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ బంట్వారం, వివిధ గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్ముతున్నారని తెలిపారు. చిన్న వయస్సులోనే యువత మద్యానికి బానిసై కుటుంబ కలహాలు ఎక్కువవుతున్నాయన్నారు. అధికారులు దృష్టిసారించి బెల్టు షాపులను మూయించాలని తెలిపారు. సుభాష్, రాజు, జగదీశ్వర్, నాగరాజు, శ్రీకాంత్ ఉన్నారు.

పరిశుభ్రత, నాణ్యత పాటించకుంటే జరిమానా

కులకచర్ల, సెప్టెంబరు 25 : పరిశుభ్రత, నాణ్యత పాటించకుంటే దుకాణాలను జరిమానాలు విధిస్తామని కులకచర్ల పంచాయతీ కార్యదర్శి భాస్కర్‌గౌడ్ తెలిపారు. బుధవారం హోటళ్లు, చికెన్ సెంటర్‌లు, కిరాణ దుకాణాలను తనిఖీ చేశారు. యజమానులకు నోటీసులు జారీచేశారు. చికెన్‌సెంటర్ల వారు వ్యర్థాలను గ్రామం బయటకు తరలించాలన్నారు. హోటళ్లలో ఫిల్టర్ వాటర్‌నే వినియోగించాలని, తాజా కూరగాయలు, మాంసాహారం, చికెన్ వాడాలని యజమానులకు సూచించారు.

గోదాం నిర్మాణానికి స్థల పరిశీలన

మర్పల్లి, సెప్టెంబరు 25: నాబార్డు సంస్థ నుంచి గోదాం నిర్మాణం కోసం భూమిని పరిశీలించినట్లు తహసీల్దార్ మునీరుద్దీన్ తెలిపారు. బుధవారం మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో సర్వే నెం.234లో ప్రభుత్వ భూమిని పరిశీలించారు. నాబార్డు సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం నిల్వ కోసం గోదాం ఏర్పాటుకు 20 గుంటల నుంచి ఎకరా వరకు భూమి అవసరం ఉందన్నారు. గోదాం ఏర్పాటుకు భూ సేకరణ చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు


కమిషనర్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఘట్‌కేసర్, సెప్టెంబరు 25 : పోచారం మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డిని కాంగ్రెస్ నాయకులు బుధవారం కలిసి సమస్యలను వివరించారు. కార్యాలయంలో సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ మాజీ అధ్యక్షుడు బద్దం వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు సమస్యలను వివరించారు. ఇన్ఫోసిస్‌కు వెళ్లే రోడ్డులో వీధీలైట్లు పనిచేయడం లేదన్నారు. సంస్కృతి టౌన్‌షిప్‌లో షాపింగ్ కాంపెక్స్ లేక ప్రజలు ప్రతీ వస్తువుకు బయటకు వెళ్లాల్సి వస్తోందని, ఇక్కడ శాశ్వతంగా పెద్ద కాంపెక్స్‌ను నిర్మించాలని కోరినట్లు తెలిపారు. కమిషనర్‌ను కలిసినవారిలో గణేష్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అట్రాసిటీ కేసులు పెట్టించిన ఘనత ఆనంద్‌దే!


ధారూరు: విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ధారూరు, సెప్టెంబరు 25: సొంత పార్టీ, ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు చేయించి, వారిపై అట్రాసిటీ కేసులు పెట్టించి, భూ కుంభకోణాలు చేసిన ఘనత మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌కే దక్కుతుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మాన్‌సింగ్, మార్కెట్ కమిటీ చైర్మన్ కె.విజయబాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ రాములు అన్నారు. ధారూరులోని శుభం ఫంక్షన్ హాల్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునీ తారెడ్డిపై మర్పల్లిలో రాళ్లతో దాడిచేయించింది ఆనందేనని గుర్తుచేశారు. మున్నూర్ సోమార్, కొండాపూర్ కలాన్ పంచాయతీ రికార్డులను సీజ్ చేయించి డీపీవోతో సొంత పార్టీ సర్పంచ్‌లను వేధించిందీ ఆయనే అన్నారు. ఈ విషయాన్నీ మరిచిపోయి ఆనంద్ మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులను ఎస్ఐ సంతోష్‌తో కొట్టించిందీ ఆనందే అన్నారు. ఎమ్మెల్యేగా అభివృద్ధిని వదిలి అధికారులను బెదిరించి భూ కుంభకోణాలు చేసి సంపాదించారని విమర్శించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై ఇష్టమున్నట్టు మాట్లాడితే ఊరుకునేదిలేదని, మరోసారి స్పీకర్‌పై నోరుపారుసుకుంటే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా వారు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ కార్యకర్తలే నిన్ను వద్దనుకున్నారు'

బంట్వారం: 'బీఆర్ఎస్ కార్యకర్తలే నిన్ను వద్దు అనుకున్నది మర్చిపోయావా?' అని మాజీ ఎమ్మెల్యే ఆనంద్‌ను ఉద్దేశించి కాంగ్రెస్ మండల అధ్యక్షుడ పోచారం వెంకటేశం అన్నారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. మర్పల్లిలో స్పీకర్‌పై అనుచిత వాఖ్యలు సరికాదన్నారు. నీ పాలన చూసి బీఆర్ఎస్ కార్యకర్తలే ఆనంద్ ను వద్దనుకున్నారని, పేదల భూములను కబ్జాచేసి అమ్ముకొని సొమ్ముచేసుకున్నార న్నారు. స్పీకర్‌ను దూషిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్‌సీసెల్ మండల అధ్యక్షుడు నర్సింలు, అంజిరెడ్డి, సిద్ధిరాములు, యాదగిరి, శ్రీకాంత్, శ్రీనివాస్, ఇసాక్, ముజీబ్, ఆశయ్య, వెంటయ్యయాదయ్య, గిరిదాస్, క్రిష్ణ, పురుషోత్తం ఉన్నారు.

స్పీకర్‌ను విమర్శిస్తే ఊరుకోం : గుడిసె లక్ష్మణ్


మాట్లాడుతున్న నాయకుడు లక్ష్మణ్

వికారాబాద్: స్పీకర్‌ను విమర్శిస్తే ఊరుకునేది లేదని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిసె లక్ష్మణ్ అన్నారు. ఆయన మాట్లాడుతూ.. స్పీకర్ గతంలో వికారాబాద్ పట్టణానికి శాటిలైట్ టౌన్ తీసుకొచ్చారని, ఇప్పుడు వికారాబాద్ ప్రాంతంలో రోడ్ల అభివృద్ధి కోసం ఢిల్లీ వెళ్లి కృషిచేస్తున్నారన్నారు. మెతుకు ఆనంద్ హయాంలో వికారాబాద్‌లో ఏ అభివృద్ధీ జరుగలేదని, అందుకే ప్రజలు ఆయనను ఓడగొట్టారని గుర్తుంచుకోవాలన్నారు. స్పీకర్‌పై మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకునేది లేదని మునిసిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో సమావేశం మాట్లాడారు. గవర్నర్ తరువాత అంత గౌరవప్రదమైన పదవి స్పీకర్ అని, అలాంటి ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ నాయకులు అనుచిత వ్యాఖ్యాలు చేయడం సరికాదన్నారు. మరోసారి ఇలా చేస్తే ఊరుకోం అని స్పష్టం చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల మాట్లాడుతూ.. మునిసిపల్ సమావేశ మందిరంలో కౌన్సిలర్ వద్ద మైక్ తీసుకున్నానని తనపైనా మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించాడని ఆరోపించారు. మునిసిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రతిపక్ష నాయకులు స్పీకర్ గురించి మంచిగా మాట్లాడుతుంటే మాజీ ఎమ్మెల్యే ఆనంద్ మతి ఉండే మాట్లాడుతున్నారా? అని అన్నారు. పీఏసీఎస్ మాజీ చైర్మన్ కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. తనపై, తన కుటుంబ సభ్యులపై తప్పుడు కేసులు పెట్టారని మండి పడ్డారు. ఇప్పటికైనా ఆనంద్ తన పద్ధతి మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రత్నారెడ్డి, పట్లూర్ సురేష్, మురళి, రాంచందర్‌రెడ్డి, సురేష్, ముత్తర్‌షరీప్, గంగూలు యాదవ్, అనంత్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే ప్రోద్బలంతోనే దాడులకు యత్నం

మోమిన్‌పేట్: స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను విమర్శిస్తే సహించేది లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శంకర్‌యాదవ్ అన్నారు. పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. గతంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ప్రోద్బలంతోనే జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సునితారెడ్డిపై ఆయన వర్గీయులు అడ్డుకొని దాడికి యత్నించారని ఆరోపించారు. ఇప్పుడు మర్పల్లిలో జరిగిన సంఘటనలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఇష్టమొచ్చినట్లు విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో మర్పల్లి ఏఎంసీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు మానెయ్య, సుభాష్‌గౌడ్, సురేందర్, మహేందర్‌చారి, మహంత్‌స్వామి, ఏజాజ్‌పాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పార్టీ మండల అధ్యక్షుడు శంకర్


మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్

సెల్‌ఫోన్, ఇయర్ ఫోన్ ఎక్కువ వాడితే

అరోగ్య సమస్యలు

యాలాల, సెప్టెంబరు 25: సెల్‌ఫోన్, ఇయర్ ఫోన్ ఎక్కువగా మాట్లిడితే ఆరోగ్య సమస్యలు వస్తున్నామని యాలాల పీహెచ్‌సీ ఇన్‌చార్జి వైద్యురాలు భువనేశ్వరి అన్నారు. బుధవారం యాలాలలోని జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో ఇంటర్నేషనల్ ఆఫ్ డే దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ నెల 23 నుంచి 29వ తేదీ వరకు 'డే ఆఫ్ డెఫ్' కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక పాఠశాలలో కార్యక్రమం నిర్వహించామన్నారు. ముఖ్య అతిథిగా మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. మంచికి మాత్రమే సెల్‌ఫోన్ వినియోగించాలని, అధికంగా ఫోన్ మాట్లాడితే అనారోగ్య సమస్యలు తప్పవ నిన్నారు. కార్యక్రమంలో ప్రైమరీ హెల్త్ సూపర్‌వైజర్ విజయ, సుశీల, సీనియర్ అసిస్టెంట్ బసయ్యగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వరి పొలాలను సందర్శించిన ఏవో


వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి అర్చన

మేడ్చల్ టౌన్, సెప్టెబరు 25 : మండలంలోని శ్రీరంగవరం వరి పంట పొలాలను మేడ్చల్ వ్యవసాయ అధికారి అర్చన బుధవారం సందర్శించారు. వరి పంటను పరిశీలించి తెగుళ్ల సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. వరి పంటలకు సీజనల్‌గా సోకే తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉంటూ వాటి నివారణ కోసం నిపుణుల సలహాలతో మందులు స్ప్రే చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ సుమతి, తేజస్వినీ గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● ఘట్‌కేసర్ రూరల్: ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అనురాగ్ యూనివర్సిటీ ఫార్మసీ డీన్ వసుధ భక్షి తెలిపారు. వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో బుధవారం జరిగిన ప్రపంచ ఫార్మసిస్ట్ డే సందర్భంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 220 మంది రక్త పరీక్షలు చేయించుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. మనిషికి ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు. రోజూ వ్యాయామం చేయడం చేస్తే ఆరోగ్యంగా ఉంటామని విద్యార్థులకు సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ కిరణ్, కృష్ణప్రసాద్, రామ్మోహన్, మౌనిక, రాజేంద్ర, తిరుపతి, విద్యార్థులు పాల్గొన్నారు.

● బొంరాస్‌పేట్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా అమలు చేయాలని, రైతు భరోసా విడుదల చేయాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు నెహ్రూనాయక్ అన్నారు. ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ కొంత మందికే చేశారని, రైతు భరోసా ఎకరానికి రూ.7,500 రైతులకు ఇవ్వలేదన్నారు. ఆసరా పింఛన్‌ల పెంపు, మహిళలకు రూ.2,500 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలను మాయ మాటలతో కాంగ్రెస్ పార్టీ ఉచిత హామీలతో మోసం చేసిందని విమర్శించారు.

● పరిగి: బీజేపి సభ్యత్వాన్ని పరిగి నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో చేయిస్తామని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బి.మారుతికిరణ్ అన్నారు. పరిగిలో పార్టీ సభ్యత్వాలను మొబైల్‌ఫోన్ ద్వారా చేయించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సంకల్పించిన వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడానికి బీజేపీని బలోపితం చేయాలని కోరారు. ప్రధానంగా యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బీజేపీ సభ్యత్వాలు తీసుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో టెలికాం అడ్వైజరీ బోర్డు సభ్యుడు హరికృష్ణ, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్య, అనిల్, ప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

● బషీరాబాద్: నవాల్గ జడ్పీ పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం జగదీశ్వర్ ఎంపీపీఎస్ పాఠశాలలను తనిఖీ చేశారు. పర్వత్‌పల్లి, నీళ్లపల్లి పాఠశాలల్లో యూ-డైస్ ఫ్లస్ డేటా ఎంట్రీకి సంబంధించి ఫిజికల్ వెరిఫికేషన్ చేశారు. ప్రధానోపాధ్యాయులు రాఘవరెడ్డితో పలు అంశాలపై చర్చించారు. నీళ్లపల్లి పాఠశాలను సందర్శించిన మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించారు. హెచ్ఎం, భోజన మహిళలకు సూచనలు చేశారు.

● బొంరాస్‌పేట్: ప్రభుత్వం టీచర్ల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు గౌరారం గోపాల్ అన్నారు. బొంరాస్‌పేట్ ఎంఈవోగా బాధ్యతలు చేపట్టిననేనావత్ హరిలాల్‌ను సంఘం నాయకులు సన్మానించారు. ఉపాధ్యాయ సమస్యలపై ఎంఈవోకు వినతిపత్రం ఇచ్చారు. అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజన బియ్యాన్ని పాఠశాల పాయింట్‌కు అందించాలని, విద్యార్థులకు రెండో జత డ్రెస్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎస్.మల్లేశ్, నరేందర్‌గౌడ్, అలీముద్దీన్, జీ.వెంకటయ్య, శివరాజ్, రమేశ్, ఆనంద్, ప్రశాంత్, శోభారాణి, స్రవంతి, సోమ్లా, వేణుగోపాల్, ఖలీల్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

● మోమిన్‌పేట్: సీఎం రేవంత్‌రెడ్డికి రాజీవ్‌గాంధీ విగ్రహం ఏర్పాటుపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదని బీఆర్ఎస్ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్ ఆరోపించారు. మండల కేంద్రంలో ఇటీవల కుక్క కాటుకు గురైన బాలుడిని పరామర్శించి ఆర్థికసాయం చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా వాసి అని చెప్పుకునే రేవంత్‌రెడ్డి ప్రజల రక్షణకు చర్యలు తీసుకుంటే బాగుంటుందన్నారు. కుక్క కాటు బాధితులపై వినతిపత్రాలు ఇస్తున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రకాంత్, నాయకులు సమద్, సర్వారాజ్, మల్లేశ్‌గౌడ్, ఎల్లారెడ్డి, చందుగౌడ్, ప్రవీణ్, సల్మాన్, రఫీ, వెంకట్‌గౌడ్, ఏజాజ్, తిరుపతిరెడ్డి, భాగ్యరాజు, మహేశ్, సురేశ్, రాజపత్రిరెడ్డి, వెంకట్‌గౌడ్, మధుసూదన్, ప్రశాంత్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

● పూడూరు: మేడిపల్లికలాన్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కిట్లు పంపిణీ చేశారు. గ్రామంలో గ్రీన్‌సోల్ ఫౌండేషన్ సహకారంతో అంకిత సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, మ్యాట్లు, చెప్పులు అందజేశారు.

క్రైం కార్నర్

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నవాబుపేట, సెప్టెంబరు 25 : రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన నవాబుపేట మండలంలో జరిగింది. మండలంలోని ముబారక్‌పూర్ గ్రామానికి చెందిన మాల దర్శన్(40) బుధవారం గ్రామం నుంచి రైలు పట్టాలు దాటి వెళ్తుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొట్టడంతో అతడికి రెండు కాళ్లు విరిగిపోయాయి. దీంతో అక్కడిక్కడే మృతిచెందాడు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.


మాల దర్శన్(ఫైల్)